గ్రామాలాభివృద్ధికి పెద్దపీట



బీటీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ, ఫిబ్రవరి 13: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వేపూర్‌లో రూ.15లక్షలతో యాదవ భవనం, రూ.50లక్షలతో సీసీరోడ్లు, కిష్టంపల్లి నుంచి జూలపల్లి వరకు బీటీరోడ్డుకు రూ.కోటి 50లక్షలు, ఇబ్రహీంబాద్‌లో రూ.5లక్షల సీసీరోడ్డ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. పనులు నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామన్నారు. త్వరలోనే సన్న బియ్యం అందిస్తామని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం సంస్థ వైర్మన్ నర్సింహా రెడ్డి, జిల్లా గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు శాంతయ్య, ముడా చైర్మన్ లక్ష్మణ్, తాసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంపీడీవో యశోదరమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, నవనీత, బొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

‘మోడల్’ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి13: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా గురువారం జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన హాకా ఫార్మర్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు నిత్యానందం, వెంకటయ్య, నాయకులు రవిశంకర్, మీనాజ్, అశోక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలించాలి

జెండా ఊపి ప్రచార రథం ప్రారంభిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట, ఫిబ్రవరి 13: జిల్లాలో బేటీ బచావో బేటీ పడావో ప్రచార రథం ద్వారా బాల్య వివాహాల నిర్మూలన, లింగ సమానత్వం, బాలిక విద్యపై విస్తృత్తంగా ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ సూచించారు. గురువారం పట్టణంలోని కలెక్టరేట్ ఆవరణలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బేటీ బచావో బేటీ పడావో పథకం 10ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో బాలికల సంక్షేమానికి, బాలికల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయిలో సాంస్కృతిక కళాకారులు, చైతన్య గీతాలతో ప్రచారం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయ, సీడీపీవో వెంకటమ్మ, సూపర్‌వైజర్ శ్రీలత, మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

బలవంతపు భూ సేకరణ ఆపాలి



భూములను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామారెడ్డి

ఊట్కూర్, ఫిబ్రవరి 13: నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల్లో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూసేకరణను తక్షణమే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తిప్రాస్‌పల్లి, బాపురం శివారు రైతులతో కలిసి భూ సేకరణ కోసం చేపట్టిన సర్వే భూములను పరిశీలించారు. పేద రైతుల కడుపు కొట్టి పెద్దోళ్ల భూములను కాపాడే ప్రయత్నం చేయడం ప్రభుత్వానికి, అధికారులకు తగదని హెచ్చరించారు. బాధిత రైతులకు న్యాయమైన పరిహారం దక్కేందుకు వెన్నంటి ఉండి సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. పంప్‌హౌజ్, సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం సారవంతమైన పొలాలను చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతుల నుంచి సేకరించడం తగదని, ప్రభుత్వ భూముల్లో కొలతలు నిర్వహించి ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌రాం, శంకర్, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలి

ధన్వాడ, ఫిబ్రవరి 13: మండలంలోని చర్లపల్లి, హన్‌మాన్‌పల్లి, రామకిష్టయ్యపల్లి, కొండ్రోనిపల్లి, మంత్రోనిపల్లిని రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని బీఆర్ఎస్ నాయకులు సుధీర్‌కుమార్‌రావు, సునీల్‌రెడ్డి కారెడ్డి, వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. రెవెన్యూ గ్రామాలుగా లేకపోవడంతో రెవెన్యూ పరమైన ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రభుత్వం స్పందించి వెంటనే రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని కోరారు.

దర్జాగా శిఖం భూమి కబ్జా

- ప్రభుత్వం వేసిన బోరు మాయం
- ఎదిరించి అడిగిన వారికి బెదిరింపులు
- పుష్కలంగా నాయకుల అండదండలు
- గతంలోనే అధికారులకు ఫిర్యాదు
- చోద్యం చూస్తున్న అధికార గణం

నవాబ్‌పేట, ఫిబ్రవరి 13: మండలంలోని కొల్లూరులో రూ.కోట్లు విలువజేసే ప్రభుత్వ శిఖం భూమిని కొంతమంది అక్రమార్కులు.. నాయకుల అండదండలతో దర్జాగా కబ్జాకు పాల్పడ్డారు. ఊరికి ఎక్కడో దూరంగా ఉన్న ప్రాంతమో..లేక విలువ లేని భూమియో కాదు.. గ్రామంలోని ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న విలువైన భూమిని కొంత మంది కబ్జా చేసి కాజేస్తున్నా.. అధికారులు మాత్రం స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గ్రామానికి చెందిన కొంతమంది నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతోనే ఈ భూమి కబ్జాకు గురవుతోందని పలువురు గ్రామస్తులు బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. మండలంలోని కొల్లూరు నుంచి గేట్ వద్ద ప్రధాన రోడ్డుకు వెళ్లే బీటీ రోడ్డుకు పక్కనే సర్వే నెంబర్ 8లో 11గుంటల శిఖం భూమి ఉన్నది. ఈ భూమి దశాబ్దాల నుంచి ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో సైతం చూపుతోంది. కాగా ఈ భూమిపై అదే గ్రామానికి చెందిన కొంతమంది నాయకుల కన్ను పడింది. శిఖం భూమి పక్కనే ఉన్న భూమిని చూపుతూ.. ఈ భూమి కూడా తమ పట్టా భూమిలోనే ఉందంటూ 15 రోజుల నుంచి భూమిలో పనులు ప్రారంభించారు. ఆగమేఘాల మీద భూమిని చదును చేయించారు. 13ఏండ్లకిందట నాటి ప్రభుత్వం గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు అదే భూమిలో బోరు వేయించింది. అదే బోరులో మోటరు బిగించి అప్పట్లో గ్రామానికి నీటిని సైతం సరఫరా చేశారు. ప్రభుత్వం వేసిన బోరును అక్రమార్కులు కన్పించకుండా చేశారు. బోరుపై మొరం పోసి పూర్తిగా మాయం చేశారు. ప్రస్తుతం కబ్జా చేసిన స్థలంలో యథేచ్ఛగా షాపింగ్ కాంప్లెక్స్ పనులు చకచకా కొనసాగుతున్నాయి. కబ్జాకు గురైన భూమి విలువ సుమారుగా 1కోటి 50లక్షలు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు ప్రతిరోజూ కబ్జాకు గురైన భూమి పక్క నుంచే వెళ్తున్నారు.. కానీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ భూమి కబ్జా విషయమై గతంలోనే గ్రామానికి చెందిన కొంతమంది ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తే.. ఆ భూమి శిఖం భూమి అని.. తమ పరిధిలోకి రాదని ఎంపీడీవో తెలిపారని గ్రామస్తులు వివరించారు. కాగా రెండు రోజుల కిందట గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు శిఖం భూమి కబ్జాకు గురవుతోందని, కాపాడాలని తాసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తాసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. శిఖం భూమి కబ్జా అయినట్లు గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని తెలిపారు. త్వరలోనే ఈ భూమిలో సర్వే నిర్వహించి.. నిజానిజాలు వెల్లడిస్తామని తెలిపారు.

శిఖం భూమిలో షాపింగ్ నిర్మాణాలు చేపడుతున్న ఆక్రమణదారులు

శిక్షణ సెక్షన్ ఆఫీసర్ల పర్యటన

మూసాపేట, ఫిబ్రవరి 13: మూసాపేట తాసీల్దార్, ఎమ్మార్సీ కార్యాలయాలను గురువారం శిక్షణ సెక్షన్ ఆఫీసర్లు సందర్శించారు. హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తెలంగాణలో శిక్షణ పొందుతున్న సెక్షన్ ఆఫీసర్లు జిల్లా పర్యటనలో భాగంగా ఒక బృందం సభ్యులు మూసాపేట మండలంలోని ఎమ్మార్సీని సందర్శించి విద్యార్థుల మధ్యాహ్న భోజనం, విద్యాప్రమాణాలపై ఆరా తీశారు. అదే విధంగా తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రేషన్‌కార్డులు, ప్రతినెలా అందజేస్తున్న రేషన్ సరుకులపై ఆరా తీశారు. అదే విధంగా కార్యాలయ నిర్వాహణపై సమీక్షించారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజు, ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మద్దూర్(కొత్తపల్లి), ఫిబ్రవరి 13: అపరిచిత వ్యక్తులపై ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా టీ సేప్ యాప్ ద్వారా ఫిర్యాదు చేవవచ్చని షీటీమ్ పోలీసులు పేర్కొన్నారు. గురువారం కొత్తపల్లి మండలంలోని నిడ్జింత జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిరోజు స్కూలు, కళాశాలకు వచ్చే విదార్థులు, మహిళలు టీ సేప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రయాణం చేసే సమయంలో తప్పక ఉపయోగించుకోవాలని తెలిపారు. మహిళలు, బాలికలు ఎక్కువగా తెలిసిన వారితో వేధింపులకు గురువుతున్నారని, అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని ధైర్యంగా ఉండి షీటీమ్ పోలీసుల సెల్ నెంబర్ 8712670398, డయల్ 100కి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచి ఆకతాయిల ఆటకట్టించి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీటీమ్ పోలీసులు బాలరాజు, చెన్నయ్య పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

మూసాపేట(అడ్డాకుల), ఫిబ్రవరి 13: రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, మరొకరు గాయపడిన ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా కిష్టగిరికి చెందిన పసుపుల రవీందర్(32) కాటవరం శివారులోని పలుగురాళ్ల గుట్టలో రాళ్లు కొట్టుకుంటూ అడ్డాకులలో భార్య వసంత ఏడాది కూతురుతోపాటు కలిసి జీవనం సాగిస్తున్నాడు. అదే విధంగా కొల్లాపూర్ పెంట్లవెల్లికి చెందిన శాలు పలుగురాళ్ల గుట్టలోనే పనిచేస్తూ అడ్డాకులలో నివాసం ఉంటున్నాడు. అయితే వీరిద్దరూ కలిసి బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు మోటర్ సైకిల్‌పై వెళ్తున్నారు. అడ్డాకుల మండలంలోని కాటవరం జాతీయ రహదారిపై వెళ్తుండగా అడ్డాకులకు చెందిన జేసీపీ కాటవరం రోడ్డు మలుపు వద్ద అడ్డాకుల వైపు మళ్తూ మోటర్ సైకిల్‌ను ఢీ కొట్టింది. దీంతో అక్కడికక్కడే రవీందర్ మృతి చెందాడు. శాలుకు తీవ్ర గాయలు కావడంతో జిల్లా దవాఖానకు తరలించగా.. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. మృతుడు రవీందర్ భార్య వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి..

నవాబ్‌పేట, ఫిబ్రవరి 13: మండలంలోని సిద్దోటంకు చెందిన సొప్పరి లింగయ్య(50) చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో పడిమృతి చెందినట్లు ఏఎస్సై జనార్దన్ తెలిపారు. ఏఎస్సై కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లింగయ్య బుధవారం మధ్యాహ్నం తన ఇంటి నుంచి వ్యవసాయ పొలానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. గ్రామ శివారులోని సొప్పరి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. లింగయ్యకు అప్పల బాధ అధికమైనందుకే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పలువురు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

మనస్తాపంతో మహిళ ..

బిందు

మిడ్జిల్, ఫిబ్రవరి 13: మనస్తాపంతో చెట్టుకు ఉరేసుకొని మహిళ మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై నాగేశ్వర్‌నాయుడు కథనం ప్రకారం.. చేదుగట్టుతండాకు చెందిన బిందు(20) అన్న భార్య రాజీతో తరుచూ గొడవపడుతుండేది. గురువారం మరోసారి గొడవ జరగగా ఖైరంపల్లికి చెందిన యాదయ్యగౌడ్, రాజీ కలసి బిందును దూషించగా మనస్తాపం చెంది వ్యవసాయ పొలంలో చెట్టుకి ఉరేసుకున్నది. మృతురాలి తండ్రి నేనావత్ శ్రీనునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు.

నేటినుంచి ‘మన మహబూబ్‌నగర్-మహానగరోత్సవం’

- మినీ శిల్పారామంలో కార్యక్రమాల నిర్వహణ
- ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ విజయేందిర బోయి సమీక్ష

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 13: నేడు, రేపు జిల్లాకేంద్రంలోని మినీ శిల్పారామంలో మన మహబూబ్‌నగర్-మహానగరోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణంలోని శిల్పారామంలో ఉదయం 10:30 నుంచి రాత్రి 8:30గంటల వరకు నిర్వహిస్తామన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా ఏర్పాటైన సందర్భంగా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14,15 తేదీల్లో రెండు రోజులు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫన్‌గేమ్స్, మూవీ నైట్, మార్కెట్ స్టాల్స్, ఫుడ్‌స్టాల్స్, సాంస్కృతిక, ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎంట్రీ ఉచితమని, పట్టణంలోని పురప్రముఖులు, ప్రతిఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాయింట్ సెక్రటరీగా పాలమూరు కలెక్టర్

కలెక్టర్ విజయేందిర బోయికి జాయింట్ సెక్రటరీగా పదోన్నతి వచ్చిన సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు కలెక్టర్‌ను గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

భూత్పూర్,ఫిబ్రవరి 13: ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ విజయేందిరబోయి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ విజయేందిరబోయి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆరోగ్య కేంద్రంలోని రిజిష్టర్లు, పరిసరాలను పరిశీలించారు. అదేవిధంగా లేబర్ రూంలో కాన్పు జరుగుతుండగా ఇందుకు సంబంధించి వివరాలను అడిగితెలుసుకున్నారు. కాన్పులు నెలకు ఎన్ని జరుగుతున్నాయని తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడారు. దవాఖాన సేవలు మరింతగా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరాచారి, డాక్టర్లు రబ్బు, జహీరోద్దిన్, ఎంపీవో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ విజయేందిర బోయికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీజీవో నాయకులు

మొక్కజొన్న పంటలో క్షేత్ర దినోత్సవం

జడ్చర్ల, ఫిబ్రవరి 13: మండలంలోని కోడ్గల్‌లో గురువారం ఐఐఎంఆర్, పీజేటీఏయూ వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతుల పొలాల్లోని మొక్కజొన్న పంటలో గురువారం క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. పంటలసాగులో అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభించేలా రైతును ప్రోత్సహించడంతోపాటు సాంకేతికతలపై రైతుల సందేహాలను నివృత్తి చేయడం దినోత్సవ లక్ష్యమని శాస్త్రవేత్తలు తెలిపారు. మొక్కజొన్న సాగుపై రైతులకు ఉన్న సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేయడంతోపాటు మొక్కజొన్న నుంచి ఇథనాల్ ఉత్పత్తి ప్రయోజనాలు, దేశంలో పెట్రోల్‌తో కలిపిన మొక్కజొన్న ఇథనాల్ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఇది జీహెచ్‌జీ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందని, శిలాజ ఇంధనాలతో పోలిస్తే తక్కువ గాలితో సంక్రమించే కాలుష్యాలను కలిగి ఉంటుందని తెలిపారు. మొక్కజొన్న క్షేత్ర దినోత్సవంలో వింటర్ నర్సరీ సెంటర్, ఐసీఏఆర్, ఐఐఎంఆర్, మొక్కజొన్న పరిశోధన కేంద్రం, పీజేటీఏయూ హైదరాబాద్ సంయుక్తంగా సమావేశాన్ని నిర్వహించాయి. క్షేత్ర దినోత్సవంలో శాస్త్రవేత్తలు డబ్ల్యూఎన్ఎస్ ప్రిన్సిపాల్ సైంటిస్టు లక్ష్మీసౌజన్య, లూధియానాలోని ఐసీఏఆర్, ఐఐఎంఆర్ నుంచి వైపీ-1కిశోర్‌కుమార్, పీజేటీఏయూ సుజాత, వాణిశ్రీ, డీఏవో వెంకటేశ్, జడ్చర్ల ఏవో గోపీనాథ్, రైతులు నవీన్‌రెడ్డి, నర్సింహులుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

సమానత్వం సాధించాలి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 13: సబ్బండ వర్గాల ప్రజలు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధించాలని బీసీ ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో సామాజిక ఉద్యమ నేత అక్కల బాబుగౌడ్ రచించిన విముక్తి (రాజకీయ కవిత సంపుటి) పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటు విలువ, అణచి వేయబడిన వర్గాల ప్రజల రాజకీయ ఓటు చైతన్యం, సబ్బండ జాతులు రాజకీయ అధికారాన్ని సాధించే దిశగా తన కవితలతో స్పష్టమైన సరళమైన భాషలో ఈ పుస్తకంలో వివరించడం జరిగిందన్నారు. నేటి రాజకీయ పరిస్థితులు, పాలనా విధానాలు, రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజా సంక్షేమ పాలనపై అద్భుతంగా వివరించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రంగప్పయాదవ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంగౌడ్, పేట జిల్లా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పన, సాఫ్ట్‌స్కిల్స్‌పై శిక్షణ తరగతులు

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి13: పట్టణంలోని డాక్టర్ బీఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సౌజన్యంతో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఉపాధి కల్పన, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో డిగ్రీ పట్టాతోపాటు ఉద్యోగ సాధనలో అవసరమైన సాఫ్ట్‌స్కిల్స్ అవసరమన్నారు. ఇందుకు విద్యార్థులకు ఆరురోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా సాఫ్ట్ స్కిల్స్‌ను గురించి వివరించారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ చందర్, తిరుపతి, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ నాగలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ నర్మద, లత, వీరప్రతాప్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నివారించాలి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 13: ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని సునంద మల్టీ స్పెషాలిటీ దవాఖానలో నాన్ ఓవెన్ ఫ్యాబ్రిక్ బ్యాగ్స్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నివారణకు ప్రతి పౌరుడు తమవంతుగా కృషి చేసి ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్‌శెట్టి, వైద్యులు దీపికాశెట్టి, అక్షయ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాబ్రిక్ బ్యాగ్స్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ భోగేశ్వర్లు

ఉల్లిగుండంలో దొంగతనం

దామరగిద్ద, ఫిబ్రవరి 13: మండలంలోని ఉల్లిగుండంలో బుధవారం అర్ధరాత్రి దొంగతనం జరిగిన ఘటన చోటుచేసుకున్నది. మాజీ ఎంపీటీసీ కిషన్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రోళ్ల వెంకటప్ప కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం మన్యంకొండ జాతరకు వెళ్లారు. ఎవరూ లేని సమయంలో అర్ధరాత్రి 1గంట ప్రాంతంలో బైక్‌పై వచ్చిన దొంగలు ఇండ్ల తలుపులు పగులగొట్టి, ఇంటిలోని బీరువా పగులగొట్టి అందులో ఉన్న నగదుతోపాటు, రెండు తులాల బంగారం తీసుకెళ్లారు. గ్రామస్తుల అలికిడి రావడంతో తాము తెచ్చుకున్న బైక్‌ను అక్కడే వెళ్లారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

జాతీయ సెలవు దినంగా ప్రకటించాలి

మహబూబ్‌నగర్ అర్బన్/మహ్మదాబాద్, ఫిబ్రవరి 13: సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీ హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఎల్‌హెచ్ఎస్ఎస్ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంజుభట్, రమేశ్‌నాయక్, రత్నావత్ గోవింద్ నాయక్ పాల్గొన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన విద్యార్థి సంఘం మహ్మదాబాద్ ఉమ్మడి మండలాధ్యక్షుడు రాజునాయక్ తెలిపారు.

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 13: లంబాడి ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ జయంతిని ఈనెల 15న జిల్లా కేంద్రంలో గిరిజన భవన్, అయ్యప్పగుట్టపై ఘనంగా నిర్వహించనున్నట్లు గిరిజనాభివృద్ధి జిల్లా అధికారి చత్రునాయక్ గురువారం ప్రకటనలో తెలిపారు. బంజారా మహిళలు, గిరిజను, అధికారులు పాల్గొనాలని కోరారు.

ట్రైనీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

దామరగిద్ద, ఫిబ్రవరి 13: మండలంలోని కానుకుర్తి పాఠశాలను ట్రైనీ కలెక్టర్ గరిమనరుల గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఎంశ్రీ నిధుల ద్వారా నిర్మిస్తున్న పాఠశాల అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. పది విద్యార్థులు ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణారెడ్డి, జీహెచ్ఎం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

నవాబ్‌పేట, ఫిబ్రవరి 13: మండలంలోని యన్మన్‌గండ్లకు చెందిన బిక్కుమళ్ల రాంచంద్రయ్య గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గురువారం రూ.10వేల విరాళం అందజేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాంచంద్రయ్య రూ.10వేల నగదును ఎంఈవో నాగ్యానాయక్, హెచ్ఎం శ్రీనివాస్ సమక్షంలో అందజేశారు. రాంచంద్రయ్యను స్ఫూర్తిగా తీసుకొని ప్రతిఒక్కరూ పాఠశాల అభివృద్ధికి ముందుకు రావాలని ఎంఈవో నాగ్యానాయక్ కోరారు.

ఆయకట్టుకు నీటి విడుదల

దేవరకద్ర, ఫిబ్రవరి 13: మండలంలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టు పొలాలకు నీటిని విడుదల చేశారు. మండలంలోని కోయిల్‌సాగర్, నాగన్నపల్లి, చిన్నరాజమూర్, పెద్దరాజమూర్, నాగారం, బస్వాపూర్, నార్లోనికుంట, బల్సుపల్లి, గూరకొండ, పెద్దగోప్లాపూర్ తదితర గ్రామాల రైతులు ఆయకట్టు కింద వరి